క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాజీ సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే, తదితరులు

చేవెళ్ల: ఇటీవల అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ మారుతున్నాడనే వార్తలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుండటంతో ఆయన తాజాగా కేసీఆర్‌ను కలిసి తాను బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నట్లుగా సంకేతాలు పంపిస్తున్నట్లుగా తెలుస్తోంది.

అడ్వకేట్ చంద్రశేఖర్‌కు బార్ నివాళి

షాద్‌నగర్: న్యాయవాదిగా, అయ్యప్ప గురుస్వామిగా ఎన్నో సేవలు అందించిన గోలెపు చంద్రశేఖర్(55) శనివారం ఉదయం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన కాలేయ సమస్యతో బాధపడుతూ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గోలెపు చంద్రశేఖర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. అయితే చంద్రశేఖర్ షాద్‌నగర్‌లో న్యాయవాదిగా పనిచేయడంతో పాటుగా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. గోలెపు చంద్రశేఖర్ మృతి పట్ల పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నివాళులర్పించారు. అదేవిధంగా పలువురు పట్టణ ప్రముఖులు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సత్యసాయిబాబా మార్గాలు ఆదర్శం



పూజల్లో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: భగవాన్ సత్యసాయిబాబా చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని చేవెళ్ల సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయిబాబా సేవా మందిరంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు సత్యసాయిబాబా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని 25 మంది దంపతులు సామూహిక వ్రతాలపై కూర్చొని పూజలు చేశారు. ప్రతి ఒక్కరికి సత్యసాయిబాబా చూపించిన మార్గాలు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ఎంతో కృషి చేస్తున్నారని హెచ్ఎం రామినాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో దాతలు రాజు, నరేశ్, ఆకృతి ఫౌండేషన్, వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీ, దుస్తులు అందజేశారు. అనంతరం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

శంకర్‌పల్లి: మండలంలోని కొజ్జగూడ గ్రామంలో శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురవుతోందని గ్రామస్తులు శనివారం తహసీల్దార్ సురేందర్‌కు ఫిర్యాదు చేశారు. 1.12 ఎకరాల స్థలంలో ఉన్న శ్మశానవాటికను తమ గ్రామానికి చెందిన నర్సింలు అనే వ్యక్తి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, దీనిని అడ్డుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల ఖాతాలోకి వేతనాలు

హర్షం వ్యక్తం చేసిన కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఎట్టకేలకు వేతనాలు వారి ఖాతాల్లో జమయ్యాయి. మూడునెలలుగా వేతనాలు అందకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు పడుతున్న ఇబ్బందుల గురించి సాక్షిలో ఈ నెల 13న 'వేతనాలు అందక.. వెతలు తీరక' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం రాత్రి వారి ఖాతాల్లోకి నగదు జమ కావడంతో వారు శుక్ర, శనివారాల్లో బ్యాంకుల్లో నగదును తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ కార్మికులు, కారోబార్‌లు మాట్లాడుతూ.. మూడునెలలుగా వేతనాలు అందకపోవడంతో పూటగడవని దుస్థితి నెలకొందన్నారు. వేతనాలు అందేటట్లు చేసిన సాక్షికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



చేవెళ్ల: ఆలూరులో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు



షాబాద్: బోడంపహాడ్‌లో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి



షాబాద్: తాళ్లపల్లిలో కాడెద్దులతో రైతు



కొందుర్గు: రావిర్యాలలో ఎద్దులను రంగులతో అలంకరించిన రైతన్న

చేవెళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని రైతులు ఎద్దులు, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆలూరు, దామరగిద్ద, అంతారం, కౌకుంట్ల, తాలరం, తంగడపల్లి, బస్తేపూర్, మీర్జాగూడ, గుండాల, అల్లవాడ, పామెన, చనువెల్లి, పలుగుట్ట, ముడిమ్యాల, రావులపల్లి, కమ్మెట, ఎన్కేపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఎద్దులను రంగులతో అందంగా ముస్తాబు చేసి పొంగలి ప్రసాదాలతో వాటికి నైవేద్యంగా సమర్పించారు. తొలకరి చినుకు కోసం ప్రార్థిస్తూ వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండి అంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఈ పండుగను జరుపుకున్నారు. గ్రామాల్లో ఎద్దులను అందగా ముస్తాబు చేసి గ్రామంలో ఊరేగించటం, పొలాల వద్ద నాగలికట్టి పొలం దున్నటం లాంటి పనులు చేపట్టారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాడెద్దులను రంగులతో అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కొందుర్గు మండలంలోని ముట్పూర్ గ్రామంలో ఎండ్లబండ్లను ఊరేగించి మల్లికార్జున స్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

షాబాద్‌లో..

షాబాద్: మండలంలో రైతులు శనివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ, అంతారం, లింగారెడ్డిగూడ, చర్లగూడ, తాళ్లపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో రైతులు తమ కాడెద్దులను, ఎడ్లబండ్లను అందంగా అలంకరించారు. వారికి ఇష్టమొచ్చిన రంగులతో తుది మెరుగులు దిద్దారు. దేవాలయాల వద్దకు బండ్లతో ర్యాలీగా వెళ్లారు. పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండే విధంగా చూడాలని తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ అధికారులతో సమీక్ష



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న బస్సు సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల నుంచి పట్టణానికి పెద్దఎత్తున విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారన్నారు. విద్యార్థులకు సమయానికి అనుకూలంగా బస్సు సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఏ గ్రామానికి బస్సు సమస్య రావొద్దని, పాత రూట్లలో బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. బస్సుల కొరత ఉన్నందున కొత్తగా ఏడు బస్సులను ప్రభుత్వం షాద్‌నగర్ డిపోకు కేటాయించిందన్నారు. త్వరలో మరో ఏడు బస్సులు రానున్నట్లు తెలిపారు. డిపోలో సిబ్బంది కొరత విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

షాద్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో షాద్‌నగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థులకు వివరించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించిందని, విద్యార్థులకు అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటుగా ప్రొజెక్టర్లతో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులతో పాఠాలను బోధిస్తున్నట్లు తెలిపారు. పోటీపరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని, కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో విద్యార్థులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో దివ్యశక్తి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. పరిశ్రమల యజమానులు స్వలాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. తద్వారా సమాజంలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిరుపేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివ్యశక్తి రౌండ్ టేబుల్ సంస్థవారు పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి పరిశ్రమ వారు తమవంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కృష్ణవేణి, శ్రీశైలంగౌడ్, బాబర్‌ఖాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్సై కిషన్‌సింగ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో నూతన విద్యార్థి సంఘం ఎన్నికల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లవి ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యాసంస్థల చైర్మన్ మల్క కొమురయ్య, సీఈఓ యశశ్వి మల్క, మొయినాబాద్ ఎస్సై కిషన్‌సింగ్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నూతన విద్యార్థి సంఘాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాబోధనతో పాటు విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే విద్యార్థులకు న్యాయకత్వ లక్ష్యణాలు ఎంతో అవసరమని సూచించారు. పాఠశాలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యమ మాధభూషి, సీసీఏ ప్రియాంక మధు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, తదితరులు

కొత్తూరు: చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులు రూ.6.8 లక్షలతో పాఠశాలలో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అప్పుడే విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించి అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని తెలిపారు. ముఖ్యంగా బోధనలో వస్తున్న మార్పులకు అనుకూలంగా ఉపాధ్యాయులు నూతన పద్ధతుల్లో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, దయానంద్‌రెడ్డి, రాజుగౌడ్, రాములుగౌడ్, జయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేఎల్ డీమ్డ్ టూబీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధివర్మ



కరాటే, యోగాలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల బృందం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు కరాటేతో పాటు యోగ ఆసనాలు చేసినప్పుడే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని కేఎల్ డీమ్డ్ టూబీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధివర్మ అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో కరాటేతో పాటు యోగా కార్యక్రమాలను వారంరోజులుగా నిర్వహించారు. చివరిరోజు విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శరీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆకెళ్ల, డాక్టర్ కోటేశ్వర్‌రావు,విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హాస్టల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో 35 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆధార్ జిరాక్స్, మూడు ఫొటోలు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, పాఠశాల బోనోఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కురిసిన వర్షం.. రైతన్నల హర్షం

నందిగామ: విత్తనాలు నాటి వర్షాలు కురవక దిక్కులు చూస్తున్న రైతన్నలు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రమైన నందిగామతో పాటు అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ, నర్సప్పగూడ, వీర్లపల్లి, చేగూరు, వెంకమ్మగూడ, అప్పారెడ్డిగూడ, మామిడిపల్లి, మేకగూడ, రంగాపూర్ తదితర గ్రామాల్లో విస్తారంగా వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. వేసవి దుక్కులు దున్నిన రైతన్నలు తొలకరి వర్షానికే చాలా మంది రైతులు పత్తి విత్తనాలను నాటారు. విత్తనాలు నాటిన నుంచి వర్షాలు కురవకపోవడంతో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు విత్తనాలు మొలకెత్తకపోవడంతో మళ్లీ దుక్కులు దున్నేశారు. మరికొంత మంది వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం సుమారు 45 నిమిషాల వరకు వర్షం కురవడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు విత్తనాలు నాటని రైతులు నేటి నుంచి విత్తనాలు నాటేందుకు సన్నద్ధం అవుతున్నారు.

పాఠశాలకు వంటపాత్రలు అందజేత



సిబ్బందికి వంటపాత్రలు అందజేస్తున్న సురేందర్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వ్యాపారులు, రాజకీయ నాయకులు తమవంతు సహకారం అందించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కక్రొళ్ల సురేందర్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలకు శనివారం ఆయన సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వంట పాత్రలను అందజేశారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సైతం తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అహర్నిషలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రాజేందర్, వరుణ్, మహిపాల్, యాదగిరి, హెచ్ఎం అంగోర్‌నాయక్, ఉపాధ్యాయులు విజయ్‌సాగర్, గోప్య పాల్గొన్నారు.

వాల్మీకి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న టర్కీ రాయబారి

శంకర్‌పల్లి: 16 ఏళ్లుగా వాల్మీకి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అద్భుతం అని, ఈ సేవలను మరింత విస్తరించాలని టర్కీ రాయబారి అర్హన్ యల్మన్ ఓకాన్ ఆకాంక్షించారు. శనివారం మండలంలోని జన్వాడలో వాల్మీకి ఫౌండేషన్ 16వ వార్షికోత్సవాలు నిర్వహించగా ముఖ్య అతిథులుగా టర్కీ రాయబారి అర్హన్ యల్మన్ ఓకాన్ దంపతులు, ప్రముఖ గైనాకాలజిస్ట్ పద్మశ్రీ డా.మంజుల, డా.రోహిణి, డా.శివానంద్‌రెడ్డి, వివేక్‌వర్మ హాజరయ్యారు. మండలంలోని 25 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 20 సైకిళ్లు, 1000 బ్యాగులు, 6వేల నోట్‌బుక్స్, స్టేషనరీ అందించారు. టర్కీ రాయబారి మాట్లాడుతూ.. విద్యార్థులను కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిచిందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ గణేశ్, కార్యదర్శి హరికిషన్, పుష్పలను ప్రత్యేకంగా అభినందించారు. డా.మంజుల మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపైనే కాకుండా ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. మండల విద్యాధికారి అక్బర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వాల్మీకి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. ఫౌండేషన్ తరపున సమాజానికి సేవ చేస్తున్న పలువురికి సేవాగురు–2024 అవార్డులను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రవళిక, జన్వాడ ఎంపీటీసీ నాగేందర్, మిర్జాగూడ, జన్వాడ మాజీ సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, లలిత, ఉపాధ్యాయులు అశోక్, తాహేర్ అలీ, నరహరి, జయసింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

పట్టించుకోని అధికారులు



వంతెన కింద చేరిన వరదనీరు



సంపుపై చేరిన వరదనీరు

కొత్తూరు: పట్టణంలోని జాతీయ రహదారి వై జంక్షన్ కూడలి సమీపంలో నిర్మించిన అండర్ పాస్ వంతెన కింద నుంచి వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేయకుండానే వంతెనను అధికారులు ప్రారంభించారు. దీంతో శనివారం పట్టణంలో కురిసిన చిరు వర్షానికే వరదనీరు వంతెన కిందకు చేరింది. దీనికి తోడు వరద నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన సంపుకు పైభాగంలో ఎలాంటి మూత (మ్యాన్‌హోల్) ఏర్పాటు చేయలేదు. వర్షం కారణంగా సంపు పైభాగం కూడా కనిపించలేదు. దీన్ని గమనించకుండా సంపు సమీపంలో నుంచి వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు సంపులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించి సంపుపై కప్పు ఏర్పాటు చేయడంతో పాటు పనులు మొత్తం పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.